
సాక్షి నంద్యాల

ఆదివారం । 21 । మే । 2023



టీబీ డ్యామ్‌కు ఇన్‌ఫ్లో

హొళగుంద: తుంగభద్ర జలాశయానికి 1,093 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. టీబీ డ్యాంలో ప్రస్తుతం 4 టీఎంసీల నీరు నిల్వ ఉండగా.. ఔట్‌ఫ్లో 251 క్యూసెక్కులు ఉంది.



అహోబిలేశుడికి విశేష పూజలు

ఆళ్లగడ్డ: దిగువ అహోబిలం ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులను పట్టు వస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.



శ్రీశైలం చేరుకున్న స్పీకర్

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల దర్శనార్థం శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం కుటుంబ సమేతంగా శనివారం శ్రీశైలం చేరుకున్నారు.

న్యూస్‌రీల్

రైతులకు అందుబాటులో వ్యవసాయ పంచాంగం

నంద్యాల (సెంట్రల్): ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం (లాం-గుంటూరు) విడుదల చేసిన 2023-24 వ్యవసాయ పంచాంగం నంద్యాల ఏరువాక కేంద్రంలో అందుబాటులో ఉంచినట్లు కో ఆర్డినేటర్ సరళమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ ఉత్పాదకత, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, సాగు వ్యయం పెరుగుదల, కూలీల కొరత తదితర అంశాలపై నిపుణుల సలహాలు, సూచనలు ఇందులో పొందుపరచారని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతిక, వాతావరణ సూచనలు, మార్కెట్ సమాచారం, పంటల బీమా, యాంత్రీకరణ, పశుపోషణ వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు పంచాంగం ఎంతో దోహదపడుతుందన్నారు. వ్యవసాయ పంచాంగం కావాల్సిన రైతులు రూ.250 చెల్లించి ఏరువాక కేంద్రంలో పొందవచ్చన్నారు.

ప్రశాంతంగా ఏపీఆర్‌జేసీ పరీక్ష

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో ఏపీఆర్‌జేసీ పరీక్ష శనివారం పది కేంద్రాల్లో ప్రశాంతంగా జరిగినట్లు ఏపీఆర్‌జేసీ జిల్లా కో ఆర్డినేటర్ మాలిక్ బాషా తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించారు. 5వ తరగతి నుంచి 8వ తరగతి వరకు 1,388 మంది విద్యార్థులు గాను 1,109 మంది పరీక్షకు హాజరయ్యారన్నారు. ఇంటర్ ప్రవేశానికి నిర్వహించిన పరీక్షకు 2,483 మందికి గాను 2,036 మంది హాజరైనట్లు చెప్పారు. డిగ్రీ ప్రవేశ పరీక్షకు 86 మందికి గాను 60 మంది హాజరయ్యారన్నారు. పరీక్ష కేంద్రాలను డీఈఓ అనురాధ పరిశీలించారు. రూట్ ఆఫీసర్లుగా సత్యనారాయణ, శివరామప్రసాద్ వ్యవహరించారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల డిపో నుంచి ప్రతి పౌర్ణమికి అరుణాచలానికి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు సర్వీసును నడుపుతున్నట్లు డిపో మేనేజర్ గంగాధర్‌రావు శనివారం తెలిపారు. ఈ మేరకు జూన్ 3వ తేదీ ఉదయం 7 గంటలకు నంద్యాల డిపో నుంచి బయల్దేరే బస్సు కాణిపాకం మీదుగా రాత్రికి అరుణాచలం చేరుకుంటుందన్నారు. అక్కడ గిరి ప్రదక్షిణ, దర్శనం అనంతరం మరుసటి రోజు సాయంత్రం తిరుగు ప్రయాణమై మార్గమధ్యలో వేలూరులోని స్వర్ణదేవాలయం దర్శనం అనంతరం నంద్యాలకు చేరుకుంటుందన్నారు. ఈ యాత్రకు రానుపోను టికెట్ చార్జీ రూ.1,730 అని, రిజర్వేషన్ సౌకర్యం కల్పించామన్నారు.

అన్నదాన పథకానికి విరాళం



ఆలయ అధికారులకు చెక్కును అందజేస్తున్న నంద్యాలకు చెందిన దాత లక్ష్మణస్వామి

శ్రీశైలంటెంపుల్: భక్తుల సౌకర్యం కోసం శ్రీశైల దేవస్థానం ఏర్పాటు చేసిన నిత్యాన్నదాన పథకానికి శనివారం పలువురు దాతలు విరాళాలు అందజేశారు. వీరిలో హైదరాబాద్‌కు చెందిన వై.నాగ సుష్మ రూ.1,01,116, నంద్యాలకు చెందిన ఎం. లక్ష్మణస్వామి రూ.1,01,116 విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని అధికారులకు అందజేయగా, వారు దాతలకు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, విరాళానికి సంబంధించిన బాండును అందజేశారు.

హజ్ యాత్రికులు నిబంధనలు పాటించాలి

కర్నూలు(రాజ్‌విహార్): హజ్ కోసం పవిత్ర మక్కా, మదీనాకు వెళ్లే యాత్రికులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని మౌలానా అబ్దుల్ మాజిద్ అన్నారు. శనివారం కర్నూలు జిల్లా హజ్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో యాత్రకు వెళ్లే వారికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హజ్ కోసం సౌదీ అరేబియాలోని పవిత్ర మక్కాతో పాటు మదీనా ప్రాంతాల్లో 40 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

లక్ష్యం.. శతకం

- కేజీబీవీల్లో వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ప్రత్యేక తరగతులు
- సప్లిమెంటరీ పరీక్షల్లో ప్రతి ఒక్కరూ పాస్ అయ్యేలా శిక్షణ
- జిల్లాలో ఎక్కడైనా తరగతులకు హాజరయ్యేలా వెసులుబాటు



విద్యార్థినిలకు శిక్షణ ఇస్తున్న లెక్చరర్లు

ఆళ్లగడ్డ: పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు విద్యా సంవత్సరం నష్టపోకుండా రాష్ట్ర ప్రభుత్వం రెమిడియల్ తరగతులు నిర్వహిస్తూ ప్రోత్సహిస్తోంది. గతంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాల్లో పది, ఇంటర్ చదివే విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో ఫెయిల్ అయితే.. మళ్లీ సప్లిమెంటరీ పరీక్ష రాసేందుకు అవసరమైన శిక్షణకు ప్రైవేటు క్లాసులకు వెళ్లాల్సి వచ్చేది. లేదంటే ఇంటి దగ్గరే సొంతంగా పుస్తకాలతో కుస్తీ పట్టాలి.. అది లేదంటే ఇక చదువు వంటపట్టలేదులే.. అని చేతులెత్తాల్సి వచ్చేది. ఫెయిల్ అయిన వారిలో బాలికలైతే చదువు ఆపేసి పెళ్లి సంబంధాలు చూసేవారు. ఇది గమనించిన ప్రభుత్వం సర్కారు బడుల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో ప్రత్యేకంగా వసతితో కూడిన శిక్షణ ఇస్తున్నారు. జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో చదువుతున్న ఏ ఒక్క బాలిక వెనకబడిపోకూడదనే ఉద్దేశంతో ఫెయిల్ అయిన వారితో పాటు ఇంప్రూమెంట్ రాసే వారిని సైతం రప్పించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. ఇందుకోసం జిల్లాలో ఆరు కేజీబీవీలను ఎంపిక చేసి అందులో రెమిడియల్ కోచింగ్ (ప్రత్యేక శిక్షణ తరగతులు) ఏర్పాటు చేశారు. ఈ నిర్ణయంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

పరీక్షలు పూర్తయ్యే వరకు..

పది, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు పూర్తయ్యే వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 24 నుంచి మొదలై జూన్ 1వ తేదీ వరకు జరగనున్న ఇంటర్ మీడియెట్, జూన్ 2 నుంచి మొదలై జూన్ 10 వరకు జరగనున్న 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రతిరోజు సబ్జెక్టుల వారీగా ప్రణాళిక తయారు చేసి బోధన కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా ఇంగ్లిష్, మ్యాథ్స్, సైన్స్ వంటి ముఖ్యమైన సబ్జెక్టుల విషయంలో మరింత శ్రద్ధ కనబర్చుతున్నారు. ఈ ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న కేజీబీవీలను డీఈఓ, డీవైఈవోలు, ఎంఈవోలతో పాటు జిల్లా, మండల స్థాయి అధికారులు ఆకస్మిక తనిఖీ చేస్తూ విద్యార్థులను చైతన్య పరుస్తున్నారు.

ప్రత్యేక శిక్షణ ఇలా..

- ➢ చదువుతో పాటు పౌష్టిక ఆహారాన్ని అందిస్తూ ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక తరగతులు నిర్వహణ
- ➢ మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు ఉదయం 5.30 నుంచి 6.30 గంటల వరకు యోగా
- ➢ ఉదయం 7 నుంచి 9 గంటల వరకు స్టడీ అవర్
- ➢ 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయా సబ్జెక్టుల్లో ఫెయిల్ వారిని విడివిడిగా కూర్చోబెట్టి వాటిపై ప్రత్యేక శిక్షణ
- ➢ ప్రతి రాత్రి రెండు సబ్జెక్టులపై మోడల్ పరీక్ష

తరగతులు నిర్వహిస్తున్న కేజీబీవీ	హాజరయ్యే విద్యార్థినులకు చెందిన కేజీబీవీలు
బనగానపల్లె	డోన్, ప్యాపిలి, బేతంచెర్ల, బనగానపల్లె
సంజామల	సంజామల, ఉయ్యాలవాడ, అవుకు, కొలిమిగుండ్ల
వెలుగోడు	కొత్తపల్లె, ఆత్మకూరు, బండిఆత్మకూరు, వెలుగోడు
గడివేముల	మిడుతూరు, పడిదాల, పాములపాడు, గడివేముల, జూపాడు బంగ్లా
నంద్యాల (మైనార్టీ)	గోస్పాడు, మహానంది, పాణ్యం, రుద్రవరం, నంద్యాల(మైనార్టీ), నంద్యాల జనరల్
చాగలమర్రి	శిరివెళ్ల, దొర్నిపాడు, చాగలమర్రి

చదువు మానిపించే వారు



మాది నిరుపేద కుటుంబం. దొర్నిపాడు కేజీబీవీలో ఇంటర్ చదువుతూ రెండు సబ్జెక్టుల్లో ఫెయిల్ అయ్యాను. మేడం వాళ్లు ఫోన్ చేసి ఉచితంగా వసతి కల్పిస్తూ శిక్షణ ఇస్తున్నామని, చాగలమర్రి కేజీబీవీకి రావాలని చెప్పడంతో చాలా సంతోషం వేసింది. ఈ అవకాశం లేకపోతే మా వాళ్లు చదువు మానిపించే వాళ్లు. కచ్చితంగా పాస్ అవుతా.

– వరలక్ష్మి, పలుకూరు, బనగానిపల్లె మండలం

ఆత్మవిశ్వాసం పెరిగింది



శిరివెళ్ల కేజీబీవీ (మైనార్టీ)లో చదువుతూ 10వ తరగతిలో రెండు సబ్జెక్టులో ఫెయిల్ అయ్యా. ఇప్పుడు చాగలమర్రి కేజీబీవీ ప్రత్యేక తరగతుల్లో సబ్జెక్టుల వారీగా టీచర్లు ఇస్తున్న సూచనలు, సలహాలతో పరీక్షలంటే భయం పోయింది. కచ్చితంగా పాస్ అవుతానన్న ఆత్మవిశ్వాసం పెరిగింది.

– నజిమూన్, ఆలమూరు, రుద్రవరం మండలం

పేద విద్యార్థులకు మంచి అవకాశం



కేజీబీవీల్లో చదివే బాలికలు అందరూ గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుపేదలు, తల్లిదండ్రులు లేని అనాథలు. వారి భవిష్యత్‌కు ఆటంకం కలుగకూడదని ప్రభుత్వం చొరవ తీసుకుంది. 10వ తరగతి, ఇంటర్‌లో ఫెయిల్ అయిన వారి కోసం గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రత్యేక రెమెడియల్ కోచింగ్ నిర్వహిస్తోంది. ఫెయిల్ అయిన విద్యార్థులందరూ కచ్చితంగా ఉత్తీర్ణత సాధించేలా ఆయా సబ్జెక్టుల టీచర్లు చక్కని బోధన అందిస్తున్నారు. – అనురాధ, జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో – ఆర్డినేటర్

మార్పు కనిపిస్తోంది



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పరీక్షల్లో ఫెయిల్ అయిన బాలికలకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ఫెయిల్ అయినవారు తిరిగి ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. ప్రాధాన్యత ఉన్న ప్రశ్నలను ఎంపిక చేసి వాటిపైనే రోజుకు రెండు సార్లు పరీక్ష పెట్టి విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాం. విద్యార్థినిలకు వచ్చిన మార్కులు ఏరోజుకారోజు ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేస్తూ ఉన్నతాధికారుల సూచనలు సలహాలు తీసుకుంటున్నాం. చాలా విద్యార్థుల్లో మార్పు కనిపిస్తోంది. అందరూ పాస్ అవుతారనే నమ్మకం కలుగుతుంది.

– షాహిన్‌బేనజీర్, ఫిజిక్స్ లెక్చరర్, కేజీబీవీ చాగలమర్రి

అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయండి

- కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్



వంద పడకల వైద్యశాల నిర్మాణ వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ

బనగానపల్లెరూరల్: ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన బనగానపల్లె పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి తహసీల్దార్ శ్రీనివాసులుగౌడ్ నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రూ.8 కోట్లతో ఆర్టీసీ బస్టాండ్ నుంచి జీఎం టాకీస్ వరకు శరవేగంగా జరుగుతున్న ఫోర్‌లేన్స్ నిర్మాణ పనులను పరిశీలించారు. అక్కడి నుంచి స్థానిక ఏరియా కమ్యూనిటీ వైద్యశాలకు చేరుకుని రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి ఆవరణలో రూ.22 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రి భవనాన్ని పరిశీలించి పనుల పురోగతిని వైద్యశాల సూపరింటెండెంట్ సుజాతను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రూ.1.20 కోట్లతో నూతనంగా నిర్మించిన ఎంపీడీవో కార్యాలయ భవనాన్ని పరిశీలించారు. అలాగే యనకండ్ల గ్రామంలోని జయజ్యోతి సిమెంట్ పరిశ్రమకు సంబంధించిన మైనింగ్ లీజ్‌ను, పలుకూరు గ్రామంలోని మరో మైనింగ్‌లీజు భూములను కలెక్టర్ పరిశీలించారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చొరవతో బనగానపల్లె పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేస్తూ ఎంపీడీఓ శివరామయ్యను అభినందించారు. ఆయన వెంట డోన్ ఆర్డీఓ వెంకటరెడ్డి, ఆర్అండ్‌బీ డీఈఈ సునీల్ రెడ్డి, పీఆర్ ఏఈ రమణ, ఆర్‌డబ్ల్యూఏఈ సాయికృష్ణ, ఎంఈఓ స్వరూప, ఆర్ఐ రాఘవేంద్రప్రసాద్, ఈఓ ఖలీల్ తదితర అధికారులు ఉన్నారు.

అదుపులోకి రాని ఉష్ణోగ్రతలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 10 రోజులుగా అధిక ఉష్ణోగ్రతలు కొనసాగుతునే ఉన్నాయి. శనివారం నంద్యాల జిల్లాలో 44.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. కర్నూలు నగరంలో రాత్రి ఉష్ణోగ్రత 30.7 డిగ్రీలు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది.

పాలిసెట్‌లో నంద్యాల విద్యార్థుల ప్రతిభ

- రాష్ట్రస్థాయిలో ర్యాంకుల సాధన

నంద్యాల(న్యూటౌన్): పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ఫలితాల్లో నంద్యాల జిల్లా విద్యార్థులు రాష్ట్రస్థాయిలో సత్తా చాటారు. ఈ నెల 10వ తేదీన జిల్లాలో 12 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 4,430 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 4,029 విద్యార్థులు రాశారు. ఈ పరీక్ష ఫలితాల్లో నంద్యాల జిల్లాకు చెందిన అనీషా తబసుమ్ 120 మార్కులకు 117 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 101 ర్యాంకు సాధించింది. అలాగే సాయివర్షిణి 110 మార్కులతో 350 ర్యాంకు, కృష్ణ చైతన్య 110 మార్కులతో 360 ర్యాంకు సాధించారు.

ఇంజనీర్ అవుతా..



పాలిసెట్‌లో రాష్ట్రస్థాయిలో 101 ర్యాంకు రావడం ఆనందంగా ఉంది. మా నాన్న నబిరసూల్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు. నాన్నను ఆదర్శంగా తీసుకొని నేను కూడా ప్రభుత్వ ఉద్యోగి కావాలన్నదే నా లక్ష్యం. భవిష్యత్తులో ఇంజనీరింగ్ ఉద్యోగం సాధించి అమ్మానాన్నల కోరిక నెరవేరుస్తా. చదువులో ప్రోత్సహిస్తున్న అమ్మానాన్నకు రుణపడి ఉంటా.

– అనీషా తబసుమ్, గోపాల్‌నగర్, నంద్యాల

ఎలాంటి శిక్షణ తీసుకోలేదు



పాలిసెట్ రాసేందుకు ఎలాంటి శిక్షణ తీసుకోలేదు. పదవ తరగతిలో నేర్చుకున్న పాఠ్యాంశాల మేరకే పాలిసెట్ రాశా. రాష్ట్రస్థాయిలో 350వ ర్యాంకు రావడం ఎంతో సంతోషంగా ఉంది. మా అమ్మ కృష్ణవేణి గృహిణి. నాన్న వెంకటరమణ కెమిస్ట్రీ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇంజినీరింగ్ కావాలన్నదే నా లక్ష్యం.

– సాయి వర్షిణి, విశ్వనగర్, నంద్యాల

అమ్మానాన్నల పేరు నిలబెడతా..



మా నాన్న బీఎస్ఎన్ఎల్‌లో ఇంజనీర్‌గా పని చేస్తుండగా, అమ్మ శ్రీవాణి గృహిణి. వారి ప్రోత్సాహంతోనే రాష్ట్రస్థాయిలో 360వ ర్యాంకు సాధించా. సివిల్ ఇంజనీర్ కావడమే నా లక్ష్యం. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి తల్లిదండ్రులకు మంచి పేరు తెస్తా.

– కృష్ణ చైతన్య, ఎస్‌జీటీస్ కాలనీ, నంద్యాల

క్లుప్తంగా

తండ్రి మందలించాడని..

నందికొట్కూరు: తండ్రి మందలించాడనే కారణంలో ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం నందికొట్కూరు పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నందికొట్కూరు పట్టణం సాయిబాబ పేటకు చెందిన బెనర్జీ, సరోజమ్మ దంపతుల కుమార్తె భువెల్ల (20) అనంతపురంలోని ఎస్కే యూనివర్సిటీలో బీ ఫార్మసీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. కాలేజీకి వేసవి సెలవులు కావడంతో ఇంటికీ చేరుకుంది. ఇంటికి వచ్చినప్పటి నుంచి కుమార్తె అన్నం సరిగా తినకపోవటంతో శనివారం తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన యువతి ఎవరూ లేని సమయంలో ఇంట్లో మచ్చుకు ఉరివేసుకుని ఆత్మహత్య పాల్పడింది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్వీ రమణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ దుర్మరణం



తీవ్ర గాయాలకు గురై మృతి చెందిన వెంకటేశ్వర్లు

పాణ్యం: కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిపై పాణ్యం సమీపంలో శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొరియర్ వ్యాన్ డ్రైవర్ దుర్మరణం చెందాడు. ఎస్ఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. కర్నూలు నుంచి నంద్యాలకు వస్తున్న కొరియర్ వ్యాన్‌ను ఎస్సార్బీసీ ప్రధాన కాల్వ వద్ద వెనుక వస్తున్న కంటైనర్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో కొరియర్ వ్యాన్ బోల్తా పడడంతో నంద్యాల పట్టణానికి చెందిన డ్రైవర్ మేకల వెంకటేశ్వర్లు(54) తీవ్రంగా గాయపడ్డాడు. 108 వాహనంలో ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. రోడ్డుపై అడ్డంగా పడిన కొరియర్ వ్యాన్‌ను హైవే పెట్రోల్ సిబ్బంది పక్కకు తొలగించడంతో నిలిచిన వాహనాలు యథావిధిగా ముందుకు కదిలాయి. మృతుడికి భార్య చౌడమ్మ, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పకడ్బందీగా ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

● జిల్లా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన/హాజరైన అధికారులు

కర్నూలు(సెంట్రల్): ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను ఈ నెల 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు పకడ్బందీగా నిర్వహించాలని ఇంటర్ బోర్డు అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో సమన్వయ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో ఇంటర్ అడ్వాన్సుడ్ సప్లిమెంటరీ పరీక్షలకు 25,559మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు చెప్పారు. ఇందులో మొదటి సంవత్సరం విద్యార్థులు 16,865 మంది, రెండో సంవత్సరం విద్యార్థులు 8694 మంది ఉన్నట్లు వివరించారు. వీరి కోసం 53 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సంవత్సరం, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండో సంవత్సరం పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లను అనుమతించవద్దని సూచించారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్‌ను అమలు చేయాలని ఆదేశించారు. పత్తికొండ, మంత్రాలయం, నాగలదిన్నె, చిప్పగిరి, తుగ్గలి తదితర ప్రాంతాలకు పరీక్షల సమయానికి అనుగుణంగా బస్సులను నడపాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో నాగేశ్వరరావు, ఆర్ఐఓ గురవయ్య శెట్టి, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, డీఈఓ రంగారెడ్డి, అడిషినల్ డీఎంహెచ్ఓ భాస్కర్, డీవీఈఓ జమీర్‌బాషా, డీఈసీ సభ్యులు కె.నాగభూషణ్‌రెడ్డి, జి.లాలెప్ప, ప్రభు, గోవిందరాజులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

కర్నూలు(హాస్పిటల్): ఆరోగ్యశ్రీ పథకం రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన ఆదేశించారు. శనివారం కర్నూలు మెడికల్ కాలేజీ ఆవరణలోని న్యూ క్లినికల్ లెక్చరర్ గ్యాలరీలో ప్రైవేటు నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలతో, ఆరోగ్యమిత్రలతో కలెక్టర్ సమావేశమయ్యారు. నెట్‌వర్క్ ఆసుపత్రులకు, ఆరోగ్యమిత్రలకు ఏవైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో 2,300 మంది క్షయ రోగులు ఉన్నారని, వారికి ఆరు నెలల పాటు పోషకాహారం కిట్లు అందించాలన్నారు. సమావేశంలో ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ రఘు, అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్, డీసీమెచ్ఎస్ డాక్టర్ రాంజీనాయక్ పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు

కర్నూలు సిటీ: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు రాసే విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా పరీక్ష కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని ఇంటర్మీడియేట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారి ఎస్.వి.ఎస్ గురువయ్యశెట్టి ఆదేశించారు. శనివారం స్థానిక టౌన్ మోడల్ కాలేజీలో పరీక్షల నిర్వహణపై సీఎస్, డీఓలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల్లో బెంచీలు ఏర్పాటు చేయాలన్నారు. తాగునీటి సదుపాయం కల్పించాలని, ప్రథమ చికిత్స చేసేందుకు అవసరమైన మెడికల్ టీఎంలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కేంద్రాల్లోకి బయటి వ్యక్తులను అనుమతించకూడదన్నారు. సమావేశంలో జిల్లా వృత్తివిద్యాధికారి జమీర్ పాషా పాల్గొన్నారు.

మల్లన్న హుండీ ఆదాయం రూ.2.80 కోట్లు



హుండీ లెక్కింపులో పాల్గొన్న దేవస్థాన సిబ్బంది

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలోని ఉభయదేవాలయాల హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా నగదు రూపేణా రూ 2,80,75,669 లభించినట్లు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి ఎస్.లవన్న తెలిపారు. శనివారం ఆలయంలోని అలంకార మండపంలో 24 రోజుల వ్యవధిలో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. నగదుతో పాటు 177 గ్రాముల 500 మి.గ్రా బంగారం, 3 కేజీల 590 గ్రాముల వెండి లభించిందన్నారు. దీంతో పాటు కొంత విదేశీ కరెన్సీ కూడా ఉందన్నారు. పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య, సీసీ కెమెరాల నిఘాలో ఈ లెక్కింపు చేపట్టారు.

సబ్సిడీ విత్తనాలకు డి-క్రిషి యాప్‌లో రిజిస్ట్రేషన్ తప్పనిసరి

● నేటి నుంచి ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్‌లు

కర్నూలు(అగ్రికల్చర్): ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సబ్సిడీపై వేరుశనగ విత్తన కాయలు, పచ్చి రొట్ట ఎరువులు పొందడానికి డీ-క్రిషి యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి రైతులకు సూచించారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ ప్రక్రియ నేటి నుంచి మొదలవుతుందని, 25వ తేదీ నుంచి సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేయాలనే లక్ష్యంగా ఉన్నట్లు చెప్పారు. ప్రభుత్వం సబ్సిడీపై పంపిణీ చేసేందుకు వేరుశనగ కే-6 రకం 15,905 క్వింటాళ్లు కేటాయించిందని.. ఇప్పటికే ఆర్‌బీకేల్లో ఏపీ సీడ్స్ 2వేల క్వింటాళ్లు రైతులకు అందుబాటులో ఉంచిందన్నారు. రైతులు నాన్ సబ్సిడీ చెల్లించిన వెంటనే వేరుశనగ ప్యాకెట్లు పంపిణీ చేస్తామన్నారు. వేరుశనగ కిలో పూర్తి ధర రూ.93లుగా నిర్ణయించగా.. ఇందులో సబ్సిడీ 40 శాతం ఉంటుందన్నారు. ఈ మేరకు రైతులు కిలో వేరుశనగకు రూ.55.80 ప్రకారం చెల్లించాలన్నారు. పచ్చి రొట్ట ఎరువులైన దయంచ, పిల్లి పెసర విత్తనాల ధరలు కూడా ఖరారయ్యాయి. వీటిని కూడా 50 శాతం సబ్సిడీతో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

ఆస్తికోసం తండ్రిపై దాడి

రుద్రవరం: ఆస్తి కోసం తండ్రిపై తనయులు దాడి చేసిన ఘటన శనివారం బి.నాగిరెడ్డిపల్లె గ్రామంలో చేటుచేసుకుంది. ఏఎస్ఐ రాంభూపాల్‌రెడ్డి వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పెద్దలింగయ్యకు ముగ్గురు కుమారులు ఉన్నారు. వీరికి సమానంగా ఆస్తి పంచి ఇచ్చాడు. తన జీవనం కోసం కొంత భూమిని ఉంచుకుని చిన్నకుమారుడు దగ్గర జీవనం సాగిస్తున్నాడు. తన పేరున ఉన్న భూమిని కూడా పంచాలని పెద్దలింగమయ్యను కుమారులు శివలింగం, బాలలింగం దాడిచేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

వేళాంగిణి మాత దర్శనానికి 26న ప్రత్యేక బస్సు

కర్నూలు(రాజ్‌విహార్): తమిళనాడులోని వేళాంగిణి మాత దర్శనం కోసం ఈనెల 26వ తేదీన సూపర్ లగ్జరీ బస్సును నడపనున్నట్లు కర్నూలు-2డిపో మేనేజరు సర్దార్‌హుసేన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాత్రి 8గంటలకు కర్నూలు కొత్తబస్టాండ్ నుంచి బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నానికి నాగపట్నం, రాత్రికి వేళాంగిణి చేరకుంటుందని పేర్కొన్నారు. 28న సాయంత్రం అక్కడి నుంచి బయలుదేరి 29న ఉదయం 9గంటకు కర్నూలు చేరుకుంటుందన్నారు. ఈ బస్సులో రానుపోను చార్జీ పెద్దలకు రూ.3వేలు, పిల్లలకు రూ.2వేలు ఉంటుందన్నారు. ముందస్తుగా టికెట్లు పొందేందుకు 73828 71131, 99592 25794 నంబర్లకు సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

పీటీడీ ఉద్యోగుల బదిలీలకు మార్గదర్శకాలు జారీ

కర్నూలు(రాజ్‌విహార్): ప్రజా రవాణా శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీలకు మార్గదర్శకాలు జారీ అయ్యాయి. జిల్లాల పునర్విభజన జరగడంతో కర్నూలు, నంద్యాల జిల్లాలు విడిపోయినా ఈసారికి రెండు జిల్లాల ఉద్యోగులు బదిలీల కోసం కర్నూలు జిల్లా ప్రజా రవాణా శాఖాధికారికే దరఖాస్తు చేసుకోవాలి. నిబంధనల మేరకు రిక్వెస్టు ప్రతిపాదికన దరఖాస్తు చేసుకునే వారు 2023 ఏప్రిల్ 30 నాటికి ఉమ్మడి కర్నూలు జిల్లాలో రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకొని ఉండాలి. రీజినల్ కేడర్ (కర్నూలు, నంద్యాల జిల్లాలు కలిపి) శ్రామిక్ నుంచి డ్రైవర్, కండక్టర్, డిపో క్లర్క్, లీడింగ్ హ్యాండ్ వరకు కర్నూలు ఆర్ఎంకు, జోనల్ కేడర్‌లోని కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌కు, రాష్ట్ర స్థాయి కేడర్ ఉన్న సిబ్బంది విజయవాడలోని చీఫ్ పర్సనల్ మేనేజర్‌కు ఈ నెల 23వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. గతంలో ఇచ్చిన దరఖాస్తులు చెల్లవని ఆర్ఎం వెంకటరామం పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి జగనన్న ఆణిముత్యాలకు ఇద్దరు ఎంపిక

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర స్థాయి జగనన్న ఆణిముత్యాలకు జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు డీఈఓ అనురాధ శనివారం తెలిపారు. పదో తరగతి, ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించడంలో భాగంగా ప్రభుత్వం జగనన్న ఆణిముత్యాల కార్యక్రమం చేపట్టిందన్నారు. జిల్లాకు చెందిన పదో తరగతి విద్యార్థులు షేక్‌మమ్మద్ సమీర్ 590, దుర్గాప్రసాద్‌నాయక్ 579 మార్కులు సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని, వీరు ఈనెల 31వ తేదీన విజయవాడలో నిర్వహించే కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అందుకుంటారన్నారు. అలాగే జిల్లాస్థాయిలో 23 మంది, నియోజకవర్గ స్థాయిలో 27 మంది ఎంపికయ్యారన్నారు. ఈనెల 25వ తేదీన నియోజకవర్గ స్థాయిలో, 27న జిల్లా స్థాయిలో టాపర్స్‌గా విద్యార్థులను నగదు బహుమతి, పతకాలతో సన్మానిస్తారు.

రైలు ఢీకొని తల్లీకుమార్తె మృతి

● మానసిక వికలాంగ కుమార్తెను రక్షించే యత్నంలో ప్రమాదం





మృతిచెందిన తల్లీ కుమార్తె నాగలక్ష్మి, లక్ష్మి (ఫైల్)

బొమ్మలసత్రం: మానసిక స్థితి సరిగాలేని కుమార్తె రైల్వేట్రాక్ దాడుతుండగా రైలు ఢీకొంటుందని తల్లి రక్షించబోయి ఇద్దరూ మృత్యువాత పడిన ఘటన శనివారం నంద్యాల జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. రైల్వే ఎస్ఐ జలీల్‌ఖాన్ తెలిపిన వివరాలివీ.. స్థానిక ఎన్జీవోస్ కాలనీలో నివాసముంటున్న ఉప్పరి చంద్రామణి, నాగలక్ష్మి (50) దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు సంతానం. పెద్దకుమారుడు ఆర్మీలో సైనికుడు. చిన్నకుమారుడు గుత్రప్ప పట్టణంలో చిన్న హోటల్ నడుపుతున్నాడు. పెద్దకుమార్తెకు వివాహం కాగా.. చిన్న కుమార్తె లక్ష్మి(30) మానసిక స్థితి సరిగా లేక ఇంట్లోనే ఉంటోంది. తండ్రి చంద్రామణి చిన్న హోటల్ నిర్వహిస్తున్నాడు. శనివారం వేకువజామున కూతురు లక్ష్మి ఇంటి నుంచి బయటకు వచ్చి పాన్నాపురం రైల్వే ట్రాక్‌పై నడుస్తూ వెళ్తోంది. ఇంట్లో కూతురు కనిపించకపోవడంతో లక్ష్మిని వెతుకుతూ రైల్వే ట్రాక్ వెంట నాగలక్ష్మి వెళ్లింది. కూతురు వెనుక రైలు వస్తుండటాన్ని గమనించిన నాగలక్ష్మి పరుగు తీసి ట్రాక్ నుంచి పక్కకు లాగేందుకు ప్రయత్నించింది. అయితే వేగంగా వస్తున్న రైలు ఇద్దరినీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తల్లీకూతుళ్లు అక్కడికక్కడే మరణించారు. స్థానికుల సమాచారంతో భర్త, సోదరుడు సంఘటనా స్థలానికి వెళ్లి బోరున విలపించారు. రైల్వే పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల సర్వజన ఆసుపత్రికి తరలించారు. భర్త చంద్రామణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

దైవ దర్శనానికి వెళ్లి వస్తూ మృత్యువాత

● రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతి చెందిన రఘు

మద్దికెర: కసాపురం ఆంజనేయస్వామి దర్శనానికి వెళ్లి వస్తూ రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ దుర్ఘటన శనివారం మద్దమ్మకుంట వద్ద చోటుచేసుకుంది. ఆదోని పట్టణం కల్లుబావి ప్రాంతానికి చెందిన పాండు, శారదమ్మలకు ఇద్దరు కుమారులు. చిన్నవాడైన రఘు(25)కు మూన్నెల్ల క్రితం లతతో వివాహం జరిపించారు. మద్దికెరలో బంధువులతో మాట్లాడి.. బంధువు కుమార్తె మానసను తీసుకొని కసాపురం ఆంజనేయస్వామి వారి దర్శనానికి నూతన దంపతులు బైకుపై వెళ్లారు. దర్శనానంతరం తిరిగి వస్తుండగా మద్దికెరలోని మద్దమ్మకుంట వద్ద రోడ్డుపై ఆటో, స్కూటర్ ఢీకొన్నాయి. తీవ్రంగా గాయపడిన వారిని గమనించి వాహనదారులు స్థానిక వైద్యశాలకు తరలిస్తుండగా రఘు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుని భార్య లత, బంధువుల అమ్మాయికి మానసను 108లో గుంతకల్లు ఆసుపత్రికి తరలించారు. మద్దికెర ఎస్ఐ మహమ్మద్ రిజ్వాన్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పండ్ల తోటల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

ఎమ్మిగనూరురూరల్: పండ్ల తోటల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధి హామీ పథకం సిబ్బందికి డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ అమర్‌నాథ్‌రెడ్డి సూచించారు. మండల పరిధిలోని కడిమెట్ల గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులు, వాటర్ షెడ్ వర్క్స్‌ను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం బనవాసిఫాంలో సెంట్రల్ నర్సరీని తనిఖీ చేశారు.